క్లుప్తంగా

ఈఎంఐల విషయమై ఒత్తిడి పెట్టవద్దు



వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : బ్యాంకు రుణాలు తీసుకున్న ప్రభుత్వ ఉద్యోగులపై ఈఎంఐలపై చెల్లింపుకై ఒత్తిడి తీసుకురావద్దని జిల్లా మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున బ్యాంకు మేనేజర్లకు విన్నవించారు. ఏపీజేఏసీ అమరావతి నేతల పిలుపు మేరకు ఆయన జేఏసీ నేత రెడ్డెన్న, ఇతర సంఘాల నేతలతో కలసి పట్టణంలోని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల మేనేజర్‌లను కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ రుణాలు తీసుకున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నెలనెలా ఈఎంఐల చెల్లింపు కోసం ఇబ్బంది పెట్టవద్దని, వారికి పెనాల్టీలు వేయవద్దంటూ కోరారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం

రాజంపేట : క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాజంపేట మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం స్పోర్ట్స్ మీట్, ఫేర్‌వెల్ డే సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యతోపాటు క్రీడలకు ప్రభుత్వం ఎంతగానో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఫార్మసీ విద్యతో రాణిస్తే దేశ, విదేశాలలో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. నేటి సమాజంలో ఫార్మసీ రంగం ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఏఐటీఎస్ విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలను కల్పించే దిశగా యాజమాన్యం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, అన్నమాచార్య ఫార్మసీ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న వెంకటసుబ్బయ్య

సిద్దవటం : మండలం కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని పంచాయతీ డివిజనల్ స్థాయి అధికారి వెంకటసుబ్బయ్య గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవలు అందించాలన్నారు. గర్భిణులు, బాలింతల స్థితిగతులను గురించి ఆరాతీయాలని మహిళా పోలీసులకు సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి వివరాలను తెలియజేయాలన్నారు. సచివాలయంలోని ఉద్యోగులు ప్రజల దరఖాస్తులను స్వీకరించి వాటిని సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, సుప్రజ, ఇంజనీరింగ్ అసిస్టెంటు శివశంకర్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డు కారాదు



విద్యార్థులకు నగదు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

రాయచోటి టౌన్ : చదువుకు పేదరికం అడ్డు కారాదని క్రమశిక్షణ, శ్రద్ధతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చుని జమియత్ ఉలేమా ఏ హింద్ రాష్ట్ర సభ్యుడు మౌలానా ఇమదుల్లా ఖాస్మీ అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని పాఠశాలోని రాయుడి కాలనీ, దఫేదార్ పల్లె, ఆలీమాబాద్ వీధి, మహబూబ్ నగర్ వీధి, పాతరాయచోటి, మాసాపేట, అహమ్మద్ నగర్, మార్కెట్ ఉర్దూ పాఠశాల, మార్కెట్ ఉర్దూ ఉన్నత పాఠశాల, కొత్తపల్లె ఉర్దూ పాఠశాలలో చదువుతున్న నిరుపేదలకు సయ్యద్ టూర్స్ అండ్ ట్రావెల్స్ యజమాని హాజీ షేక్ ఇర్షాద్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. మొత్తం 130 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.500ల చొప్పున రూ.65,000లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు శాహుల్ హమీద్, ఉపాధ్యక్షులు మహమ్మద్ ఆలీ, సొసైటీ పూర్వపు అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాస్, ప్రధాన కార్యదర్శి సిబతూర్ రహిమాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో.. కుషావతి



కుషావతి నదిలో పేరుకుపోయిన చెత్త



డంపింగ్ యార్డుగా మారిన నదీపరివాహక ప్రాంతం

మండల కేంద్రంలోని కుషావతి కాలుష్య కోరల్లో చిక్కుకుంది. వ్యర్థాలు, జంతువుల కళేబరాలతో దుర్వాసన వెదజల్లుతోంది. జీవనదిని తలపించే కుషావతి నేడు అధికారుల అలసత్వంతో వ్యర్థాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో పరిసర ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు, పొలాల వద్దకు వెళ్లే రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరోవైపు నీటి కాలుష్యంతో వేసవిలో ఈతకొట్టేందుకు వచ్చే గ్రామస్తులు వెనుదిరుగుతున్నారు. చేపలు మృత్యువాత పడుతున్నాయి. నది చుట్టూ ఉన్న ప్రాంతమంతా వ్యర్థాలతో అనధికార డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నది కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– గాలివీడు

నేటి నుంచి గంగాభవాని బ్రహ్మోత్సవాలు



సిద్దవటం : మండలంలోని బంగారుపేట గ్రామ సమీపంలో వెలసిన గంగాభవాని అమ్మవారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి జరుగునని ఆలయ ఫ్యామిలీ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ శుక్రవారం అమ్మవారికి గణపతి పూజ, స్వస్తి వాచనము, మాతృకపూజ, రుతిక్ వరణము, రక్షా బంధనము, అష్టోత్తర కలశాభిషేకం అర్చనలు, మంగళహారతి వంటి పూజా కార్యక్రమాలు చేయనున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం లక్ష కుంకుమార్చన ఉంటుందని పూజలో పాల్గొన్న మహిళలందరికి ప్రసాదాలు, గాజులు, పసుపు, కుంకుమలు అందజేస్తామన్నారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటలలోను మహాపూర్ణాహుతి, మంత్రపుష్పం, మహదాశీర్వచనం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 23వ తేదీ ఆదివారం అమ్మవారికి బోనాలు, మొక్కుబడులు చెల్లింపులు ఉంటాయన్నారు.

కొత్తపురమ్మకు పూజలు

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల గ్రామ శివారుల్లో వెలసిన కొత్తపురమ్మకు గురువారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌మూర్తికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

గాలివీడు : మండలంలో అగ్రికల్చర్ ఆధ్వర్యంలో 5 యూనిట్లు 14 ఆర్‌బీకేల పరిధిలో 27 గ్రామ సంఘాల పరిధిలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో మాస్టర్ ట్రైనర్ రామయ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏఓ) రామాంజనేయ ఆచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు ఖరీఫ్ ఆక్సీప్లాన్‌లో భాగంగా తొలకరి వర్షాలు పడకముందే విత్తన శుద్ధి చేయడం, అవసరానికి తగినట్లు ఒక ఎకరానికి 400 కేజీలు ఘన జీవామృతం సేకరించడం, చిన్న సంఘాలలోని సభ్యులందరినీ సమావేశపరిచి పొలం ఉన్న రైతులను పొలం లేని రైతులను గుర్తించి పొలం ఉన్న ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయం వైపు అవగాహన కల్పించి, భూమిలేని రైతులకు పెరటితోటలు వేయించాలని వారు సూచించారు. అనంతరం ఎన్‌పీఎం షాపు పెట్టించి ఇతర కుటీర పరిశ్రమలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ, వీఏఏ, వీహెచ్‌ఏ, యూనిట్ ఇన్‌చార్జిలు ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఐక్యతతో ముందుకెళ్దాం

వాల్మీకిపురం : బలిజలు అందరూ ఐక్యమత్యంతో ముందుకెళ్లాలని టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బలిజ సంఘం నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 24న మదనపల్లిలో బలిజసేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి అందరూ రావాలని కోరారు.

మా భవిష్యత్తు నువ్వే జగన్‌కు విశేష స్పందన



రాజంపేట: మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమంలో భూమన శంకర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమానికి జనం నుంచి విశేష స్పందన లభిస్తోందని నాగిరెడ్డిపల్లె అర్బన్ మాజీ సర్పంచ్ భూమన శంకర్‌రెడ్డి అన్నారు. గురువారం నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలో మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా ఉన్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. జగన్‌మోహనరెడ్డి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకుడు షాజహాన్, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టరు పల్లె మాధవి, నాయకులు కేసీ నాగరాజు, టైలర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో

రామాపురం : మండల పరిధిలోని కసిరెడ్డిగారిపల్లె గ్రామం పరిధిలోని సుగాలిబిడికి బెదరపల్లె, కొత్తరోడ్డు నారాయణపురం తదితర గ్రామాల్లో గురువారం గ్రామ సర్పంచ్ రఘు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని, పేద, బడుగు, బలహీనవర్గాలకు అన్ని విధాల న్యాయం చేస్తున్నారని ఆయన వివరించారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవిలో ఆర్టీసీ టూరిజం ప్యాకేజీలు

రాయచోటి టౌన్ : వేసవి సెలవులలో కుటుంబ సభ్యులతో కలసి విహారయాత్రలకు వెళ్లాలనుకొంటున్నారా అయితే మీ కోసం ఆకర్షణీయమైన ఆఫర్లతో ఆర్టీసీ సంస్థ ఆహ్వానం పలుకుతోంది. రాయచోటి ఆర్టీసీ డిపో యాత్రల డైరెక్టర్ కళావతి ప్రయాణికులకు కరపత్రాల విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె ప్రయాణికులకు అవగాహన కలిగిస్తూ వివరాలను తెలియజేశారు. వేసవి కాలంలో కుటుంబ సభ్యులతో విహారయాత్రలతో వెళ్లాలనుకొనే వారికి పలు ఆఫర్లను ఈ సందర్భంగా ప్రకటించారు.

- రాయచోటి నుంచి అరుణాచలం రెండు రోజుల యాత్ర కోసం రూ.875లు పిల్లలకు అయితే రూ.500లు మాత్రమేనని చెప్పారు. ఈ రెండు రోజుల యాత్రలో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలానికి చేరి తిరిగి రాయచోటి వస్తుందన్నారు.
- శ్రీశైలం రెండు రోజుల యాత్రలో పుష్పగిరి, బ్రహ్మంగారి మంఠం, కాశినాయన ఆశ్రమం, శ్రీశైలం చేరుకొని తిరిగి రాయచోటికి చేరుతుందన్నారు. పెద్దలకు రూ.2000లు, పిల్లలకు రూ.1200లుగా నిర్ణయించారు.
- అన్నవరం నాలుగు రోజుల విహార యాత్రకు విజయవాడ దుర్గమ్మగుడి, ద్రాక్షారామంలోని శివాలయం, అన్నవరం – శ్రీ సత్యనారాయణ స్వామిదేవస్థానం, పిఠాపురం – శక్తిపీఠంలను దర్శించి తిరిగి రాయచోటికి చేరుతుందని ఈ ప్యాక్‌లో రూ.3500లు, పిల్లలకు 2000లు చెల్లించాల్సి ఉంటుంది.
- ఊటి (మూడు రోజుల యాత్ర) హార్సిలీహిల్స్, బెంగుళూరు, మైసూరు (చాముండేశ్వరీ దేవి ఆలయం), జూ పార్కు, మైసూరు ప్యాలెస్, బృందావనం గార్డెన్స్ మీదుగా ఊటి చేరుతుందని ఈ యాత్రలో పెద్దలకు రూ.3000లు, పిల్లలకు 1700లు చెల్లించాల్సి ఉంటుంది.
- ఊటి (ఎలాంటి పుణ్యక్షేత్రాలు లేకుండా) నేరుగా ఊటి వెళ్లి వచ్చుటకు మూడు రోజుల యాత్ర కోసం పెద్దలకు రూ.1850లు, పిల్లలకు రూ.1000లు టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అలాగే భోజన ఖర్చులు ఎవరికి వారే భరించాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం ఎస్‌పి బాబు సెల్ : 9652044259 పిఎల్ కళావతి సెల్ :9346728278, యస్.మహేశ్వరీ సెల్ : 6300627302లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చున్నారు.

ప్రమాద బాధితులకు నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి అనిల్‌రెడ్డి

రాజంపేట : కొల్లావారిపల్లె దళితవాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో రెండు గుడిసెలు కాలిబూడిదయ్యాయని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం తరపున సాయాన్ని అందించినట్లు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు.

గురువారం బాధితులకు జెడ్పీ చైర్మన్ సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డితో కలిసి నగదు సాయంతోపాటు నిత్యావసరాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పక్కా ఇళ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పీసీ యోగీశ్వరరెడ్డి, తహసీల్దారు సుబ్రహ్మణ్యంరెడ్డి, జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టరు లక్ష్మినరసయ్య, కౌన్సిలర్ కటారు శేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొల్లినేని రామ్మోహన్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు విశ్వనాథరాజు, సత్యాల రామకృష్ణ, రోళ్ల మడుగు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాటానికి సిద్ధం కావాలి



మేడే కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

రాయచోటి అర్బన్ : పోరాడి సాధించుకున్న తమ హక్కుల పరిరక్షణ కోసం కార్మికులు మరో చికాగో పోరాటానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద మేడే కరపత్రాలను ఏఐటీయూసీ నేతలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, వడ్డెర విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి శంకర్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి పుల్లయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లానేతలు వెంకటేశు, బత్తల వెంకటరమణ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమం



రైల్వేకోడూరు అర్బన్ : పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో గ్రామాలలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతూ మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు గురువారం తెలిపారు. మండలంలోని వీపీఆర్ కండ్రిక లక్ష్మీపురంలో మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమాన్ని కొరముట్ల నిర్వహించిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి నేటి వరకు అవినీతికి చోటు లేకుండా నిబద్ధతతో పారదర్శకంగా పాలన సాగిస్తూ అందరికీ లబ్ధి చేకూరుస్తుండటంతో కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరి ప్రతి పేదవాడికి జగనన్నే భవిష్యత్తుగా మారాడని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, మార్కెట్ చైర్మన్ సుబ్బరామరాజు, ఉపసర్పంచ్ తోట శివసాయి, సుధాకర్‌రాజు, మల్లికార్జున్, హరికృష్ణారెడ్డి, వినోద్, ప్రతాప్, రాజేంద్ర, అంజి తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో తెగుళ్లపై రైతులకు శిక్షణ



మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి జయభరత్‌రెడ్డి

సిద్దవటం : మామిడి తోటలు కాపు దశలో ఉన్న మామిడిలో పండు ఈగ, కాయమచ్చ తెగుళ్లపై గురువారం రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామని ఉద్యానశాఖ అధికారి జయభరత్ రెడ్డి తెలిపారు. మండలంలోని జ్యోతి వంతాటిపల్లె, సిద్దవటం, పెద్దపల్లె రైతు భరోసా కేంద్రాల పరిధిలో కాపు దశలో ఉన్న మామిడి తోటలను పరిశీలించి మామిడి రైతులకు పురుగు, తెగుళ్ల నివారణకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. జయభరత్‌రెడ్డి మాట్లాడుతూ మామిడిలో పండు ఈగ నివారణకు, కాయమచ్చ తెగుళ్ల వలన కాయ దశలో దిగుబడి ఘననీయంగా తగ్గే అవకాశాలు ఉంటాయన్నారు. పండు ఈగ నివారణకు పండు ఈగ బుట్టలు ఎకరాకు 8, 10 మామిడి తోటల్లో ఏర్పాటు చేసుకోవాలని, కాయమచ్చ తెగుళ్ల నివారణకు సాఫ్ 3 గ్రాములు లేదా నీటిలో రెండు గ్రాములు, లీటరు నీటికి స్టిక్కరు లేదా జిగురు 0.5 మిల్లీ లీటర్లు మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పండు ఈగ నివారణకు కాయ మచ్చతెగులు సోకకుండా కాయ కవర్లు ఏర్పాటు చేసుకుంటే మంచి రంగు, నాణ్యత, సైజు రావడం వలన మంచి ధర పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది సందీప్, శ్రీనాథ్, ప్రేమ్‌కుమార్, శివ, మామిడి రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల సూచిక ఫ్లెక్సీల అందజేత



సూచిక బోర్డులను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

చిన్నమండెం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనల సూచిక ఫ్లెక్సీలను పోలీసులకు అందజేశారు. రాయచోటికి చెందిన సురభి ఐరన్ మార్ట్ అధినేత ఓబుల్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో గురువారం చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌కు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగేలా 60 సూచిక ఫ్లెక్సీలను రాయచోటి రూరల్ సీఐ లింగప్ప, ఎస్‌ఐ రమేష్‌బాబులకు అందజేసినట్టు క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ తెలిపారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అలాగే తమ కోసం మీ ఇంటి దగ్గర కుటుంబసభ్యులు ఎదురు చూస్తుంటారని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. లయన్స్ క్లబ్ వారు ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ప్రజలకు ఎక్కడ ఏ అవసరం వచ్చినా ముందుండి సహాయం చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో దాత ఓబుల్‌రెడ్డి, క్లబ్ ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్ర, నందిని ట్రావెల్స్ వినోద్‌కుమార్‌నాయక్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాలతో కేంద్రం చెలగాటం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

చిట్వేలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవితాలలో చెలగాటమాడుతున్నాయని సీపీఐ, సీపీఎం నాయకులు ఆరోపించారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా గురువారం మండల పరిధిలోని మైలపల్లి పంచాయతీలోని రాజారెడ్డి ఎస్టీ కాలనీ, అరుంధతి వాడ, వడ్డెపల్లి వరకు పాదయాత్ర చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పందికాళ్ల మణి, సీపీఐ మండల కార్యదర్శి తిప్పన ప్రసాద్‌లు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ వ్యతిరేక విధానాలపై ఆల్ ఇండియా కమిటీల పిలుపు మేరకు ప్రజాపోరు యాత్ర చేస్తున్నామన్నారు. పెట్రోల్, డీజిల్, ఎరువులు, నిత్యావసర సరుకుల ధరలను రోజురోజుకు పెంచుతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని ధ్వజమెత్తారు. అలాగే గనులు, విద్యుత్ ప్రాజెక్టులు, పోర్టులు, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌లకు కట్టబెడుతూ ప్రజలను పేదలుగా మారుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో శంకర్, రెడ్డయ్య, మారెమ్మ, చిన్న, శివ, రమేష్, అంకయ్య, అంకమ్మ పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపుదాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : దివ్యాంగ బాలల పట్ల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసే విధంగా తల్లిదండ్రులు కృషి చేసి మంచి భవిష్యత్తు వైపు నడపాలని రాస్ కాలేజ్ ఎడ్యుకేషనల్ ఉపాధ్యాయులు అయేషా, అజీమ్, అల్లా బకాష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మండంపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం సెన్సిటైజేషన్ ప్రోగ్రాం ఆన్ డిజబిలిటీ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు దివ్యాంగుల పట్ల వారి ప్రవర్తనలు, సహాయ సహకారాలు, చేయూతలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటిజం అనే వ్యాధితో పిల్లలు ఎక్కువగా బాధపడుతున్నారని, వీరి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ ఉందని, అటువంటి పిల్లల తల్లిదండ్రులకు ఇటువంటి కార్యక్రమాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. దివ్యాంగులలో కలిగే వివిధ రకాల ప్రవర్తనలు వారు ఎదుర్కొనే సమస్యలు, పరిష్కారాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

- 7 రోజులపాటు వివిధ వర్గాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు
- ప్రమాదాల సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై డెమో



రాయచోటి టౌన్: మంటలు ఆర్పే విధానాన్ని తెలియజేస్తున్న అధికారులు



రాజంపేట రూరల్: ఎస్‌ఓసీ గైడ్‌లైన్స్ కరపత్రాలతో ఏపీఎస్ఆర్టీసీ, అగ్నిమాపక సిబ్బంది

రాయచోటి టౌన్ : అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా బయటపడాలనే విషయంపై డ్వాక్రా సంఘం మహిళలకు, ఆర్టీసీ కార్మికులకు అగ్నిమాకశాఖ అధికారులు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా చివరి రోజు అన్నమయ్య జిల్లా ఫైర్ అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రాయచోటి మెప్మా కార్యాలయంలో, మహిళలకు గ్యాస్ సిలిండర్ లీక్, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, ఇతర సందర్భాలలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలా రక్షించుకోవాలో మహిళలతో డెమో చేసి చూపారు. అనంతరం ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ కార్మికులు, అధికారులతో కలిసి ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలో ఫైర్ సేఫ్టీ అధికారులు చేసి చూపారు. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే తమకు ఫోన్ చేయాలని రాయచోటి ఫైర్ అధికారి వెంకట్రామిరెడ్డి తెలిపారు. తమకు చేయాల్సిన ఫోన్ నంబర్ 9963737253కు ఫోన్ చేయవల్సిందిగా తెలియచేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, మెప్మా అధికారి అబ్బాస్ అలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని స్థానిక అగ్నిమాపక కేంద్ర కార్యాలయ ఆవరణలో డ్వాక్రా మహిళలతో పాటు అమరావతి విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులకు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలా బయటపడాలి అనే విషయంపై అగ్నిమాపక అధికారి బాల ఉస్సేనయ్య అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను పంపిణీ చేసి అగ్ని ప్రమాదాలపై డెమో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో, బహిరంగ ప్రదేశాలలో ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే వెంటనే తమకు తెలియజేయాలని ఆయన సూచించారు. ప్రమాదాలు సంభవించే సమయంలో అప్పటికప్పుడు ఎలా బయటపడాలన్న విషయాలపై విద్యార్థులచే అగ్నిమాపక పరికరాలను అందజేసి డ్వాక్రా మహిళలకు తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సుదర్శన్‌రెడ్డి, సాయి, డ్వాక్రా మహిళలు, అమరావతి విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్ : అగ్నిమాపక వారోత్సవాలు ముగిశాయి. గురువారం స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక అధికారి పి.శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు గ్యాస్ ప్రమాదంలో, వరదలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను గురించి మాక్ డ్రిల్స్ ద్వారా అగ్నిమాపక సిబ్బంది జాగృతి చేసింది. ప్రమాదం జరిగితే బస్సులో ఉన్న అత్యవసర ద్వారంను ఏ విధంగా ఉపయోగించుకోవాలో వారికి తెలియజేశారు. ఆయిల్ ఫైర్ జరిగినప్పుడు ఫోమ్ వాడి ఎలా నివారించాలో డెమో నిర్వహించారు. ఎస్‌ఓసి గైడ్‌లైన్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. డీఎం రమణయ్య, సిబ్బందితోపాటు తదితరులు పాల్గొన్నారు.